క్లుప్తంగా

శరవేగంగా పోలీస్ అవుట్ పోస్ట్ నిర్మాణం



ఎయిర్‌పోర్టు ప్రాంగణంలో నిర్మిస్తున్న పోలీస్ అవుట్ పోస్ట్

మధురపూడి: రాజమహేంద్రవరం విమానాశ్రయంలో పోలీస్ అవుట్ పోస్ట్ నిర్మాణ పనులు చురుకుగా సాగుతున్నాయి. ప్రయాణికుల పరిరక్షణ, భారత విమానయాన ఆస్తుల రక్షణ బాధ్యతను నిర్వర్తించే పోలీసులకు ఎయిర్ పోర్టు డైరెక్టర్ జ్ఞానేశ్వరరావు అవుట్ పోస్టును ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటి వరకూ వీరందరూ టెర్మినల్ భవనంలోనే విధులు నిర్వహించారు. అయితే విమానాశ్రయం ప్రాంగణం, టెర్మినల్ భవనం బయట గల క్యాంటీన్‌ను ఆనుకుని ఈ నిర్మాణ పనులు జోరుగా సాగుతున్నాయి. ఇక్కడ ఇద్దరు ఎస్సైలు, ఒక ఏఎస్సై, పోలీసులుంటారు.

మగ్గం వర్కులో ముగిసిన శిక్షణ



శిక్షణ పూర్తి చేసిన వారికి సర్టిఫికెట్లు అందజేస్తున్న వెంకటేశ్వరరావు

రాజానగరం: దివాన్ చెరువులోని డాక్టర్ వినయ్ సుంకర ఫౌండేషన్ ఆధ్వర్యంలో మండలంలోని రాధేయపాలెంలో మహిళలకు మగ్గం వర్కులో ఇస్తున్న శిక్షణ కార్యక్రమం శుక్రవారం ముగిసింది. ఈ సందర్భంగా శిక్షణ పూర్తి చేసిన 70 మంది మహిళలకు ఫౌండేషన్ వ్యవస్థాపకుడు సుంకర వెంకటేశ్వరరావు సర్టిఫికెట్లు అందజేశారు. పొందిన శిక్షణను సద్వినియోగం చేసుకుని, ఆర్థికంగా ఎదగాలనే ఆకాంక్షను వెలిబుచ్చారు. కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు సుంకర నాగేశ్వరరావు, వీరాస్వామి, వినీలతోపాటు అడపా వరప్రసాద్, వైవీ రావు, యనుముల చినబాబు, వడ్డి పద్మనాభం, శిక్షురాలు జంగిలి కుమారి పాల్గొన్నారు.

సంకల్పం కార్యక్రమం పరిశీలన



విద్యార్థులకు సూచనలు ఇస్తున్న డానియల్ థామస్

బిక్కవోలు: పందలపాక పడాల పెద్ద పుల్లారెడ్డి జెడ్పీ హైస్కూల్‌లో సంకల్పం జీవన నైపుణ్యాభివృద్ధి జిల్లా పాఠశాల గౌరవ పరిశీలకుడు డి డానియల్ థామస్ శుక్రవారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ జీవన నైపుణ్యాలు ప్రతి ఒక్క విద్యార్థికి ఎంతో అవసరమన్నారు. విద్యార్థుల ఆలోచన విధానంలో మార్పు తీసుకురావాలనే సంకల్పంతో, క్రీడల ద్వారా మానసిక, శారీరక వికాసం పెంపొందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఈ కార్యక్రమాన్ని పాఠశాలల్లో ప్రవేశపెట్టిందని వివరించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం చిర్ల శ్రీనివాసరెడ్డి, పీడీ ద్వారంపూడి యువరాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ అంకితభావంతో పనిచేయాలి



తహసీల్దార్ సుభాష్‌ను సన్మానిస్తున్న ఎంపీపీ తులసి తదితరులు

పెదపూడి : అంకితభావంతో ప్రతిఒక్కరూ విధి నిర్వహణ చేయాలని ఎంపీపీ కేత తులసి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం తహసీల్దార్ సుభాష్‌కు అభినందన వీడ్కోలు సభ ఏర్పాటు చేశారు. ఆయన పశ్చిమ గోదావరి జిల్లాకు బదిలీ అయ్యారు. ఎంపీపీ తులసి మాట్లాడుతూ తహసీల్దార్ సుభాష్ నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ, సేవలందించి మంచి గుర్తింపు పొందారన్నారు. అనంతరం ఆయనను శాలువా, జ్ఞాపికలతో సత్కరించారు. జెడ్పీటీసీ వేపకాయల వెంకటలక్ష్మి, రాష్ట్ర కార్యదర్శి అద్దంకి ముక్తేశ్వరరావు, రాష్ట్ర చేనేత విభాగం కార్యదర్శి పప్పు సింహాచలం, మండల సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు కోసూరు వాసు, పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు కొల్లు పెద్దకాపు తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్ బదిలీ

సీతానగరం: మండల కేంద్రమైన సీతానగరం తహసీల్దార్ పాగిరి కృష్ణారావు నల్లజర్లకు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో కృష్ణా జిల్లా గుడ్లవల్లేరు నుంచి అబ్దుల్ రహమాన్ మస్తాన్ వస్తున్నట్టు సమాచారం.

ఆరోగ్యంతోనే పరీక్ష పదిలం

- టెన్త్ పబ్లిక్ పరీక్షలు సమీపిస్తుండటంతో చదువుపైనే పిల్లల దృష్టి
- నిద్రకూ, పౌష్టికాహారానికీ ప్రాధాన్యమివ్వాలంటున్న నిపుణులు
- విద్యార్థులకు వైద్యుల కీలక సూచనలు

బిక్కవోలు: పరీక్షలు.. ఏడాది శ్రమ ఫలితానికి గీటురాయి. అందుకే పరీక్షలు సమీపించే కొద్దీ విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి సారిస్తారు. పరీక్షలంటే కొందరు విద్యార్థులకు భయం, ఆందోళన ఆవరిస్తుంటాయి. ఆత్రుతతో.. ఆందోళనతో విద్యార్థులు మరింత అధిక సమయం చదవడం, పౌష్టికాహారాన్ని నిర్లక్ష్యం చేయడం, నిద్రకు దూరం కావడంతో సహజంగా తీవ్ర మానసిక ఒత్తిడికి గురవుతుంటారు. ఈ నేపథ్యంలో పరీక్షలపై అవగాహన కల్పిస్తూ, విద్యార్థుల్లో మనోధైర్యాన్ని నింపుతున్నారు వైద్యులు.

ప్రణాళికతో మంచి ఫలితాలు

పదో తరగతి పరీక్షలు మార్చి 18 నుంచి మే వరకూ జరగనున్నాయి. ప్రతి రోజు ఓ సబ్జెక్టుపై డైలీ పరీక్షలు ఇప్పట్నుంచే నిర్వహిస్తున్నారు. ఈ నెల 23న ప్రీ-పబ్లిక్ జరగనుంది. దీంతో పరీక్షల సమయంలో విద్యార్థులు చదువుతో పాటు యోగా కూడా చేయాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. ప్రత్యేక ప్రణాళికతో విద్యార్థులు ముందుకు సాగితే, ఆనందంగా పరీక్షలు పూర్తి చేయవచ్చంటున్నారు.

నియోజకవర్గ వివరాలిలా..

మండలం	ప్రభుత్వం విద్యార్థులు	ప్రైవేటు విద్యార్థులు	మొత్తం విద్యార్థులు
అనపర్తి	627	215	842
బిక్కవోలు	557	52	609
పెదపూడి	510	248	758
రంగంపేట	561	45	606
మొత్తం	2,255	560	2,815

పరీక్షల సమయంలో విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణ ఎంతో కీలకం, అనపర్తి నియోజకవర్గంల్లో పదో తరగతి విద్యార్థులు 2,815 మంది ఉన్నారు. వీరిలో ప్రభుత్వ పాఠశాలలో 2,255 మంది, ప్రైవేటు పాఠశాలలో 560 మంది విద్యార్థులు చదువుతున్నారు.



కొంకుదురు పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు

మానసికంగా దృఢంగా ఉండాలి



పరీక్షల సమయంలో విద్యార్థులు ఎలాంటి ఒత్తిడికి లోనుకాకుండా, మానసికంగా దృఢంగా ఉండాలి. ముందుగా ప్రశ్నా పత్రం క్షుణ్ణంగా పరిశీలించి, ఏకాగ్రతతో జవాబులు రాయడం మొదలు పెట్టాలి. శరీరం దృఢంగా ఉంటేనే మానసికంగా బలంగా ఉంటాం. మంచి ఆహారం ఆరోగ్యాన్ని పదిలంగా ఉంచుకుతుంది. పిల్లలు తగినంత నీరు తాగాలి. తల్లిదండ్రులు విద్యార్థులపై శ్రద్ధ చూపాలి. టీవీ, సెల్‌ఫోన్లకు దూరంగా ఉండాలి.

– తేతలి రామారెడ్డి, మానసిక వైద్యులు, అనపర్తి

పౌష్టికాహారం తీసుకోవాలి



శరీరం, మనస్సు ఒకదానికొకటి అవినాభావ సంబంధం కలిగి ఉంటాయి. మనం తీసుకునే ఆహారం ఈ రెండింటినీ ప్రభావితం చేస్తుంది. పరీక్ష సమయంలో మానసికంగా, శారీరకంగా ఆరోగ్యంగా ఉండాలి. పోషక విలువలున్న ఆహారాన్ని సమపాళ్లలో తీసుకోవాలి. రోజు ఒక పండు, వారంలో రెండు రోజులు ఆకుకూరలు విధిగా ఉండేలా చూసుకోవాలి. పరీక్షలు పూర్తయ్యే వరకూ సాత్వికాహారం తీసుకుంటే మంచిది.

– డాక్టర్ విజయలక్ష్మి, పీహెచ్‌సీ వైద్యురాలు, కొంకుదురు

సిద్ధం సభకు పార్టీ శ్రేణులు సమాయత్తం



సిద్ధం ప్లకార్డులు ప్రదర్శిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు

అనపర్తి: ఏలూరు సమీపంలోని దెందులూరులో ఈ నెల 3న నిర్వహించే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సిద్ధం బహిరంగ సభను విజయవంతం చేసేందుకు నియోజకవర్గంలోని నాలుగు మండలాల వైఎస్సార్ సీపీ శ్రేణులు సమాయత్తమయ్యారు. శుక్రవారం స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో పార్టీ శ్రేణులతో సిద్ధం సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో అత్యధిక మెజార్టీతో జగనన్నను గెలిపిస్తామని వారు పేర్కొన్నారు. కులమతాల పేరిట ప్రజలను వేరు చేయాలని చూసే దుర్మార్గులపై పోరుకు, ప్రతిపక్షాల దుష్ట కూటమి కుట్రలపై యుద్ధానికి వైఎస్సార్ సీపీ శ్రేణులు సిద్ధంగా ఉన్నామంటూ నినదించారు. కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చౌకబారు విమర్శలతో స్థాయిని దిగజార్చుకోవద్దు

చంద్రబాబుపై ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి ధ్వజం



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి

అనపర్తి: ఎవరో రాసిచ్చిన స్క్రిప్టును చదివి చౌకబారు విమర్శలతో తన స్థాయిని దిగజార్చుకోవద్దని మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకు ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి హితవు పలికారు. శుక్రవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇటీవల రాజమహేంద్రవరం కాతేరులో నిర్వహించిన బహిరంగ సభలో తనపై, తన కుటుంబ సభ్యులపై చంద్రబాబు నాయుడు చేసిన ఆరోపణలపై ఎమ్మెల్యే ధీటుగా స్పందించారు. 40 ఏళ్ల ఇండస్ట్రీ అని చెప్పుకొనే చంద్రబాబు.. అబద్ధాలు, మోసాలు, కుట్రలు, కుతంత్రాలకు కేరాఫ్ అడ్రస్ అని ధ్వజమెత్తారు. గ్రావెల్ అవకతవకలకు సంబంధించి చంద్రబాబు తనపై విమర్శలు చేశారని, ఆ గ్రావెల్ తవ్వకాలకు ఎవరి ప్రభుత్వ హయాంలో అనుమతులు ఇచ్చారో తెలుసుకోవాలని అన్నారు. అవినీతి అనకొండగా పేరు గాంచిన టీడీపీ ఉపాధ్యక్షుడు, అనపర్తి మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి రూ.23 లక్షలు తీసుకుని గ్రావెల్ తవ్వకాలకు అనుమతులు ఇప్పించారని క్వారీకి సంబంధించిన వ్యక్తులే చెప్పడంతో పాటు, ఈ విషయమై సత్య ప్రమాణానికి సిద్ధమని బహిర్గతంగా ప్రకటించారని తెలిపారు. చంద్రబాబు అవినీతి స్కూల్‌లో శిక్షణ పొందిన మాజీ ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి నీతివంతుడు ఎలా అవుతాడని ఎద్దేవా చేశారు. చంద్రబాబు వేల కోట్ల అవినీతికి పాల్పడితే, ఆయన శిష్యుడు రామకృష్ణారెడ్డి వందల కోట్ల అవినీతికి పాల్పడ్డాడని విమర్శించారు. ఈ అవినీతి తిమింగలం విషయం తెలుసుకున్న అనపర్తి నియోజకవర్గ ప్రజలు 2019 ఎన్నికల్లో రామకృష్ణారెడ్డిని చిత్తుగా ఓడించారని అన్నారు. కాల్‌మనీ కేసుల పేరిట అనేక మందిని బ్లాక్ మెయిల్ చేయడంతో పాటు, వేధింపులకు గురిచేసి, మాజీ ఎమ్మెల్యే డబ్బులు గుంజారన్నది ఫైనాన్స్ వ్యాపారులకు తెలుసునన్నారు. చంద్రబాబు చేసిన ఆరోపణలపై సీబీఐ విచారణకు సిద్ధమని, చంద్రబాబుకు దమ్ముంటే 2014–2019 వరకు ఎమ్మెల్యేగా పాలన సాగించిన టీడీపీకి చెందిన రామకృష్ణారెడ్డిపై, 2019 నుంచి ఎమ్మెల్యేగా ఉన్న తనపై సీబీఐ విచారణ జరిగేలా మాజీ ముఖ్యమంత్రిగా కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాయాలని సూచించారు. రామకృష్ణారెడ్డి చరిత్ర, తన చరిత్ర జిల్లా ప్రజలందరికీ తెలుసునన్నారు. ఎవరెన్ని పొత్తులు పెట్టుకున్నా, కుయుక్తులు పన్నినా రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో అంతిమ విజయం వైఎస్సార్ సీపీదేనని, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో తమ ప్రభుత్వమే తిరిగి రాష్ట్రంలో పాలన సాగిస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

గ్యాస్ లీకై తాటాకిల్లు దగ్ధం



బాధితురాలిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సూర్యనారాయణరెడ్డి

రంగంపేట: నల్లమిల్లి గ్రామంలో శుక్రవారం జరిగిన అగ్నిప్రమాదంలో ఓ తాటాకిల్లు దగ్ధమైంది. గ్రామానికి చెందిన సమ్మింగి వరలక్ష్మికి చెందిన ఇంట్లో వంట చేస్తుండగా, గ్యాస్ లీక్ కావడంతో మంటలు వ్యాపించాయి. ఇల్లు మొత్తం కాలి, సుమారు రూ.3 లక్షల ఆస్తినష్టం వాటిల్లింది. బాధితురాలిని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి పరామర్శించారు. అగ్నికి ఆహుతైన ఇంటిని పరిశీలించారు. అనంతరం స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు సమకూర్చిన రూ.30 వేల నగదు, 50 కేజీల బియ్యం, వంట సామగ్రిని బాధితురాలికి అందించారు. కార్యక్రమంలో సర్పంచ్ నల్లా పద్మ, దుర్గాప్రసాద్, వైస్ ఎంపీపీ మట్టా శ్రీను, గ్రామ కన్వీనర్ కొండేపూడి చిన్న, సచివాలయ కన్వీనర్ నర్ల చక్రరావు, బూత్ కన్వీనర్ మాగాపు దొరబాబు, మండల కార్యవర్గ సభ్యుడు ప్రగడరెడ్డి గౌరీ, ఉప సర్పంచ్ కంచుమర్తి సాయిబాబా పాల్గొన్నారు.

అభివృద్ధిలో ప్రైవేటు భాగస్వామ్యం అభినందనీయం

– ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి



టాయిలెట్ బ్లాక్ శిలాఫలకాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి

అనపర్తి: ప్రభుత్వానికి ప్రైవేటు సంస్థలు సహకరిస్తే అభివృద్ధి మరింత వేగవంతం అవుతుందని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. ఐటీసీ కంపెనీ, అనపర్తి గ్రామ పంచాయతీ భాగస్వామ్యంతో స్థానిక కూరగాయల మార్కెట్ శివారులో నూతనంగా నిర్మించిన సామూహిక టాయ్‌లెట్లను ఎమ్మెల్యే శుక్రవారం ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ వ్యాపార లావాదేవీల కోసం అనపర్తి మార్కెట్‌కు వచ్చేవారికి, మెయిన్‌రోడ్‌లోని వివిధ దుకాణాల్లో పనిచేసే సిబ్బంది, దుకాణదారులు, తోపుడుబండ్ల వర్తకులకు, వారపు సంతకు వచ్చే కొనుగోలుదారులకు సామూహిక మరుగుదొడ్లు సమస్యగా ఉండేదన్నారు. ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని, ఐటీసీ కంపెనీ నిధులు రూ.25 లక్షలు, పంచాయతీ నిధులు రూ.6 లక్షలు మొత్తం 31 లక్షలతో వీటిని నిర్మించినట్టు వివరించారు. పంచాయతీ ఆధ్వర్యంలో దీని నిర్వహణ జరుగుతుందని తెలిపారు. ఎమ్మెల్యేకు అనపర్తి వర్తక సంఘం అధ్యక్షుడు సత్తి వెంకటరామారెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ అంసూరి సూర్యనారాయణ, సర్పంచ్ వారా కుమారి, కంపెనీ ఫ్యాక్టరీ మేనేజర్ ఎంఎస్ సుధీర్, అబ్దుల్ వహీద్, ప్రొడక్షన్ మేనేజర్ జె.సురేంద్ర, వాష్ ఇన్‌స్టిట్యూట్ ప్రాజెక్ట్ మేనేజర్ కె.శశిధర్, రాష్ట్ర రెడ్డి, భద్రాజుల కార్పొరేషన్ డైరెక్టర్లు సత్తి రామకృష్ణారెడ్డి, షణ్ముఖి చిట్టిరాజు, ఉప సర్పంచ్ చిర్ల వీర్రాఘవరెడ్డి, గ్రామాభివృద్ధి కమిటీ చైర్మన్ నల్లమిల్లి మురళీమోహన బాలకృష్ణారెడ్డి, ఎంపీటీసీలు చిన వెంకటరెడ్డి, కొండేటి భీమేష్, బండారు శ్రీను, తుమ్మా రాజేశ్వరి, ఏఎంసీ డైరెక్టర్ కోనాల సత్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విదేశీ విద్య, ఉద్యోగావకాశాలపై సదస్సు



మాట్లాడుతున్న ఫోర్‌ట్వీన్ సంస్థ అధినేత తులసీరామ్

సీతానగరం: మండల కేంద్రమైన సీతానగరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు విదేశీ విద్య, ఉద్యోగావకాశాలపై శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ డి.చిట్టిబాబు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రాజమహేంద్రవరానికి చెందిన ఫోర్‌ట్వీన్ ఓవర్సీస్ ఎడ్యుకేషన్ సంస్థ అధినేత గుత్తుల తులసీరామ్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత విద్యార్థులు ఒక సంవత్సరం విదేశాల్లో డిప్లమో ప్రోగ్రాం చేస్తూ, తర్వాత తప్పక ఉద్యోగాన్ని సాధించేలా తమ సంస్థ తర్ఫీదు ఇస్తుందన్నారు. బ్యాంక్ లోన్స్ అధికారి వీర రాజేష్ మాట్లాడుతూ ఎలాంటి హామీలు లేకుండా విద్యా రుణాలు ఇచ్చే బ్యాంకుల గురించి వివరించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ హరేరామకృష్ణ, అధ్యాపకులు డాక్టర్ సుధామయి, వాణి, వరలక్ష్మి, ఫణీంద్ర కుమార్, శివ దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

ఎలుకల నిర్మూలన మందు పంపిణీ



మందును రైతులకు పంపిణీ చేస్తున్న సబ్బెళ్ల కృష్ణారెడ్డి

అనపర్తి: పంటను నాశనం చేసే ఎలుకల నిర్మూలనకు వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో గ్రామంలోని రైతులకు శుక్రవారం బ్రోమోడయోలిన్ మందును ఉచితంగా పంపిణీ చేశారు. రామవరంలో సర్పంచ్ గిరడా గంగాభవాని అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో అనపర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ వరి పంటను పొట్ట దశ నుంచి ఎలుకలు నాశనం చేస్తుంటాయన్నారు. రైతులు సామూహికంగా ఎలుకల నిర్మూలన చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు నల్లమిల్లి భాగ్యలక్ష్మి, గొలుగూరి గౌతమి, పీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ చైర్మన్ గుడిమెట్లు వెంకటరెడ్డి, పంచాయతీ పాలకమండలి సభ్యురాలు కర్రి రుక్మిణికుమారి, సచివాలయ కన్వీనర్లు, ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

రైతులకు ఎలుకల మందు పంపిణీ

పెదపూడి: మండలంలోని 18 గ్రామాల రైతులకు శుక్రవారం సామూహిక ఎలుకల నివారణకు బ్రోమోడయోలిన్ మందు పంపిణీ చేసినట్టు మండల వ్యవసాయాధికారి మణిదీప్ తెలిపారు. ప్రస్తుత రబీ సీజన్‌లో నారుమడుల దశ నుంచి ఎలుకలు పంట నష్టం చేయకుండా చర్యలు చేపట్టినట్టు చెప్పారు. ఎలుకల నివారణకు చిరుపొట్ట దశలోనే రైతులందరూ సామూహికంగా మందు పెట్టాలని సూచించారు. ప్రభుత్వం రైతులకు ఉచితంగా మందును సరఫరా చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ సత్యనారాయణస్వామి, వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

వెయిట్ లిఫ్టింగ్‌లో నన్నయ విద్యార్థి సత్తా



కోటేశ్వరరావును అభినందిస్తున్న వీసీ ఆచార్య పద్మరాజు తదితరులు

రాజానగరం: చండీఘర్ యూనివర్సిటీలో జరిగిన ఆల్ ఇండియా వెయిట్ లిఫ్టింగ్ చాంపియన్ షిప్‌లో ఆదికవి నన్నయ యూనివర్సిటీ విద్యార్థి సత్తా చాటాడు. జనవరి 26 నుంచి 29 వరకూ జరిగిన ఈ పోటీలలో పురుషుల 55 కిలోల కేటగిరీలో ఈ.కోటేశ్వరరావు మూడో స్థానంలో నిలిచి బ్రాంజ్ మెడల్ సాధించాడు. గత నెలలో నన్నయ వర్సిటీలో జరిగిన సౌత్ అండ్ వెస్ట్ జోన్ వెయిట్ లిఫ్టింగ్ పోటీలలో అర్హత సాధించిన ముగ్గురు విద్యార్థులలో కోటేశ్వరరావు మూడు, జె.మధుబాబు నాలుగు స్థానాల్లో నిలిచారని వీసీ ఆచార్య కె.పద్మరాజు తెలిపారు. త్వరలో అరుణాచల్‌ప్రదేశ్‌లో జరిగే ఖేలో ఇండియా పోటీలకు వీరిద్దరూ ఎంపికయ్యారన్నారు. ఈ సందర్భంగా వారిని వీసీతో పాటు రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్, డీన్ ఆచార్య కేఎస్ రమేష్, స్పోర్ట్స్ బోర్డు సెక్రటరీ డాక్టర్ బి.రామ్ గోపాల్, కోచ్ టి.శ్రీకర్ అభినందించారు.

ఆలయాల నిర్మాణానికి చర్యలు

రాజమహేంద్రవరం సిటీ: తిరుమల తిరుపతి దేవస్థానం శ్రీవాణి ట్రస్ట్ ఆధ్వర్యంలో రాజానగరం నియోజకవర్గ వ్యాప్తంగా 117 ఆలయాల నిర్మాణానికి చర్యలు తీసుకున్నామని వైఎస్సార్ సీపీ సీజీసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి తెలిపారు. రాజమహేంద్రవరం సంహిత కన్వెన్షన్ హాల్లో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఇప్పటికే కొన్ని ఆలయాల నిర్మాణం పూర్తయిందని త్వరలోనే మిగతా ఆలయాల నిర్మాణాలు పూర్తి చేస్తామన్నారు. కోరుకొండ శ్రీలక్ష్మి నరసింహస్వామి రాజగోపురం నిర్మాణం, రంగనాథ స్వామి ఆలయ పునర్నిర్మాణ శంకుస్థాపన కార్యక్రమం త్వరలోనే నిర్వహిస్తామన్నారు. కణుపూరు శివాలయానికి మరింత ఖ్యాతి తీసుకురావడానికి గిరి ప్రదక్షిణ పెట్టాలని నిర్ణయించినట్లు తెలిపారు. కాటవరంలో రూ.50 లక్షల కామన్ గుడ్ ఫండ్‌తో శివాలయం నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు.

బాధిత మహిళకు ఎమ్మెల్యే రాజా పరామర్శ



ప్రభుత్వాసుపత్రిలో బాధితురాలు ఆశను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే రాజా

కంబాలచెరువు: సీతానగరం మండలం చిన కొండేపూడి పరిధిలోని పెదకొండేపూడిలో భర్త చేతిలో శిరోముండనానికి గురైన షేక్ ఆశ అనే మహిళను ప్రభుత్వాసుపత్రిలో శుక్రవారం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా పరామర్శించారు. ఆమె వైద్య పరీక్షల కోసం రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువచ్చారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా హుటాహుటిన రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకుని బాధిత మహిళను పరామర్శించి, జరిగిన సంఘటన వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ నిందితుడిని పట్టుకుని చట్టపరంగా శిక్షించాలని పోలీసులను ఆదేశించడం జరిగిందన్నారు. బాధిత మహిళకు ప్రభుత్వ పరంగా తోడుగా ఉంటామన్నారు.

విజయదుర్గ అమ్మవారికి విశేష పూజలు



విజయదుర్గ అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

పెదపూడి: సంపర గ్రామంలో ప్రసిద్ధి చెందిన విజయదుర్గ అమ్మవారికి శుక్రవారం విశేష పూజలు చేశారు. పుష్యమాసం సందర్భంగా ఆలయ అర్చకుడు ఖండవల్లి హనుమంతాచార్యులు ఆధ్వర్యంలో అమ్మవారికి కుంకుమ పూజలు, పంచామృతాభిషేకాలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

లలితా పారాయణ

రాజానగరం: గ్రామ దేవత ముత్యాలమ్మ ఆలయంలో శుక్రవారం సాయంత్రం లలితా సహస్ర నామ పారాయణను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్థానిక భక్తమండలి సభ్యుల ఆధ్వర్యంలో నిత్యపారాయణ జరుగుతోంది. శుక్రవారం కావడంతో అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

జాతీయ బాస్కెట్ బాల్ పోటీలకు దేవేంద్ర సాయి



పెదపూడి: జి.మామిడాడ గ్రామానికి చెందిన బి.దేవేంద్ర సాయి జాతీయ స్థాయి బాస్కెట్ బాల్ పోటీలకు ఎంపికయ్యాడు. ఈ మేరకు గ్రామానికి చెందిన బాస్కెట్ బాల్ సంఘ ప్రతినిధి సీహెచ్‌వీ కృష్ణారెడ్డి శుక్రవారం ఇక్కడ తెలిపారు. ఈ నెల 4 నుంచి 11 వరకు ఒడిషా రాష్ట్రం భువనేశ్వర్‌లో జరిగే 73వ జాతీయ స్థాయి బాస్కెట్‌బాల్ అసోసియేషన్ జూనియర్స్ పోటీలకు ఆంధ్రప్రదేశ్ బాలుర జట్టుకు ఎంపికైనట్టు చెప్పారు. నూజివీడులో జరిగిన 8వ అంతర్ జిల్లాల రాష్ట్ర స్థాయి పోటీల్లో ఉత్తమ ప్రదర్శనతో రాణించారన్నారు. జనవరి 18 నుంచి ఇప్పటి వరకు పిఠాపురంలో నిర్వహించిన జాతీయ స్థాయి శిక్షణ శిబిరంలో చక్కటి ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించారన్నారు.

క్విజ్ పోటీలో ఫైనల్‌కు రామారావు



రంగంపేట: ప్రపంచ వ్యాప్తంగా రామాయణంపై నిర్వహించిన క్విజ్ పోటీలో వెంకటాపురం గ్రామానికి చెందిన గళ్ల నాగ సత్య రామారావు ఫైనల్‌కు ఎంపికైనట్టు బీజేపీ మండల అధ్యక్షుడు ఎం.సాయిరాం శుక్రవారం ఇక్కడ తెలిపారు. చినజీయర్‌స్వామి ఆధ్వర్యంలో ప్రపంచ వ్యాప్త రామాయణంపై నిర్వహించిన క్విజ్‌లో రామారావుతో పాటు కాకినాడ నుంచి పట్టిశపు వాణి, పైని శిరీష కూడా ఫైనల్‌కు ఎంపికయ్యారని చెప్పారు. హైదరాబాద్‌లోని రామానుజాచార్యుల విగ్రహం వద్ద జరిగే ఫైనల్‌లో విజేతలకు రూ.9 లక్షల నగదు బహుమతులు అందించనున్నట్టు తెలిపారు.

గృహావసరాల సిలిండర్ల పట్టివేత

కంబాలచెరువు: గృహావసరాల సిలిండర్ల వినియోగంలో అక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవని ఇన్‌చార్జి రీజినల్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి సురేష్ బాబు హెచ్చరించారు. స్థానిక రైల్వే స్టేషన్ సమీపంలోని ఆంధ్రా మిలటరీ హోటల్‌లో డొమెస్టిక్ (గృహ) సిలిండర్లను ఉపయోగిస్తున్నారన్న సమాచారం మేరకు శుక్రవారం ఆ ప్రాంతంలో విజిలెన్స్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఆ సమయంలో హోటల్లో ఐదు గృహావసరాల సిలిండర్లను గుర్తించారు. వాటిని స్వాధీనం చేసుకుని, హోటల్ యజమాని బి.హేమంత్ కుమార్‌పై కేసు నమోదు చేశారు. తనిఖీల్లో కార్యాలయ సబ్ ఇన్‌స్పెక్టర్ జగన్నాథరెడ్డి, కానిస్టేబుళ్లు లోవరాజు, వీరబాబు, రెవెన్యూ, సివిల్ సప్లయిస్ అధికారులు పాల్గొన్నారు.

భవిత కేంద్రం సేవలు భేష్

ధవళేశ్వరం: ధవళేశ్వరంలోని భవిత కేంద్రం సేవలు బాగున్నాయని సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ సుభాషిణి అన్నారు. శుక్రవారం ధవళేశ్వరంలోని భవిత కేంద్రాన్ని సుభాషిణి, సహిత విద్య కో ఆర్డినేటర్ కనకబాబు పరిశీలించారు. రికార్డులను తనిఖీ చేశారు. ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులకు మానసికోల్లాసం కోసం స్పోర్ట్స్ కిట్లు ఇవ్వాలని సూచించారు. అనంతరం మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు.

పారిశుధ్య కార్మికులకు రేషన్ కిట్ల వితరణ

సీటీఆర్ఐ: స్థానిక శ్రీరామకృష్ణ మఠంలో స్వామి వివేకానంద 162వ జన్మతిథి వేడుకలలో భాగంగా శుక్రవారం ఉదయం పూజా కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం నారాయణసేవ పేరుతో 170 మంది పారిశుధ్య కార్మికులకు రేషన్ కిట్లు పంపిణీ చేశారు. ఒక్కొక్క రేషన్ కిట్‌లో 9 రకాల వంట సరకులు అందించారు. కార్యక్రమంలో స్వామి శశికాంతానందజీ, స్వామి వేదవిద్యానందజీ, స్వామి పరిజ్ఞేయానందజీ తదితరులు పాల్గొని, స్వామి వివేకానంద జీవితం గురించి విద్యార్థులకు వివరించారు. ఆదిత్య డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్, యూత్ రెడ్ క్రాస్ వలంటీర్లు సేవలను అందించారు.

ప్రపంచ చిత్తడి నేలల దినోత్సవం

కంబాలచెరువు: స్థానిక ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో శుక్రవారం ప్రపంచ చిత్తడి నేలల దినోత్సవం నిర్వహించారు. ముఖ్యవక్తగా హాజరైన ఏపీ స్టేట్ ఫారెస్ట్ అకాడమీ డైరెక్టర్ పీవీ ఉదయ్ భాస్కర్ మాట్లాడుతూ చిత్తడి నేలల పర్యావరణ ప్రాముఖ్యతను వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్ కె.రామచంద్రరావు మాట్లాడుతూ చిత్తడి నేలలను కాపాడుకునేందుకు అందరూ ప్రచారం చేయాలని కోరారు. కార్యక్రమంలో బోటనీ, జువాలజీ, జియాలజీ విభాగాల అధిపతులు డాక్టర్ ఎ.శ్రీనివాసరావు, డాక్టర్ ఎంఆర్ గౌతమ్, కె.దుర్గారావు పాల్గొన్నారు.